క్లుప్తంగా

కుళ్లాయప్ప మృతి బాధాకరం



కుళ్లాయప్ప మృతదేహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని డాక్టర్ అంబేడ్కర్ కాలనీకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చల్లా కుళ్లాయప్ప అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని జెడ్పీటీసీ భాస్కర్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆలూరి రమణారెడ్డి అన్నారు. సోమవారం కుళ్లాయప్ప మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, చికెన్ నారాయణస్వామి, పెద్ద కొండన్న, నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ సిబ్బందితో నేడు సమావేశం

యల్లనూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు సామాజిక తనిఖీ, ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని పేర్కొన్నారు.

శరవేగంగా కాలువ పూడికతీత పనులు



జేసీబీతో పనులు చేయిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మచ్చుకోట జలాశయానికి నీరు వచ్చే కాలువ పూడికతీత పనులు గత రెండ్రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. అక్కడక్కడా పెచ్చులు ఊడి కాలువ మూసుకుపోవడంతో ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే కాలువ పూడికతీత పనులు చేపట్టాలని అందుకు అయ్యే ఖర్చు తానే భరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గత రెండు రోజులుగా జేసీబీని ఏర్పాటు చేసి, కాలువ పూడికతీత పనులను శరవేగంగా చేస్తున్నారు. గతేడాదిలో కాలువ పూడికతీత పనులు చేపట్టడంతో మచ్చుకోట జలాశయానికి నీరు చేరింది. పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగాయిని రైతన్నలు చెబుతున్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయించండి



డ్రైనేజీలో బ్లాక్‌లను క్లియర్ చేయిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో చెత్తాచెదారంతో నిండిన డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి మురికి నీరు రోడ్లపై పారకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున శానిటరీ అధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఉదయం మెయిన్‌రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ వద్ద డ్రైనేజీలు నిండి రోడ్డుపై మురికి నీరు ప్రవహిస్తుండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పీహెచ్ వర్కర్లతో పాటు జేసీబీ ద్వారా డ్రైనేజీలో బ్లాక్‌లను క్లియర్ చేయించారు. అలాగే ధర్మవరం రైల్వే గేట్ మురికినీరు మళ్లింపునకు శాశ్వత చర్యలు చేపట్టేందుకు అంచనాలు తయారు చేయించాలని మున్సిపల్ ఇంజినీర్ గురప్పయాదవ్‌కు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, టీపీఎస్ అబ్దుల్‌సత్తార్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మురళి, తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



బోరుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి సోమవారం నూతన బోరు వేయించారు. గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. గ్రామ సర్పంచ్ మహబూబ్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్షావలి నీటి సమస్యను ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులను మంజూరు చేయించారు. సోమవారం గ్రామంలోని శివాలయం సమీపంలో రైతు భరోసా కేంద్రం వద్ద నూతన బోరు వేయించారు. పైపులైన్, విద్యుత్ మోటారును ఏర్పాటు చేయించారు. పనులు పూర్తయిన వెంటనే పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తామని తెలిపారు.

సొంతింటి కల సాకారం చేస్తాం

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి
- 45 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ



తాడిపత్రి: లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



యాడికి: కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: పేదల సొంతింటి కలను నిజం చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బుగ్గ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన 45 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. పేదలకు అవసరమైన విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని స్పష్టం చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, నాయకులు అయ్యవారిపల్లి రాము, దస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

యాడికి: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకునేది లేదని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి టీడీపీ నాయకులను హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని రాయలచెరువులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, దీనిలో ఎవ్వరి ప్రమేయం ఉండదన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో రూ.371 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించిన ఫైల్స్‌ను మాయం చేశారని తెలిపారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. 2021లో ఈ కేసు నమోదైన తర్వాత రెండు సంవత్సరాలు సీఐడీ అధికారులు అన్ని ఆధారాలతో చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచడం జరిగిందన్నారు. దీంతో న్యాయమూర్తి కస్టడీకి ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రజా సొమ్మును లూటీ చేసిన చంద్రబాబును జైలుకు పంపడంతో రాయలచెరువులో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు టపాసులు పేల్చుతుంటే టీడీపీ శ్రేణులు అడ్డుకోవడం సరికాదన్నారు. టపాసులు పేల్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులతో వాగ్వాదానికి దిగడం సిగ్గుచేటన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల జోలికొస్తే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మీరు ఎవ్వరికీ భయపడాల్సిన పని లేదని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. మీకు ఏ సమస్య వచ్చినా వెంటనే ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, తూట్రాళ్లపల్లె సర్పంచు సంజీవరాయుడు, తలారి నగేష్, రషీద్, శివయ్య, ఉపేంద్రగౌడ్, మధు, ముత్యాలరెడ్డి, చందన శివకేశవరెడ్డి, కోనా జగదీశ్వర రెడ్డి, వేలూరు జగదీష్, చిన్న వెంకటనాయుడు, రామకృష్ణ పరమహంస పాల్గొన్నారు.

నాణ్యమైన యంత్రాలు అందజేయాలి



మాట్లాడుతున్న ఎంపీ తలారి రంగయ్య

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)ను సోమవారం అనంతపురం ఎంపీ తలారి రంగయ్య సందర్శించారు. వ్యవసాయ యంత్రాల నాణ్యతను పరిశీలించి, రైతులకు క్వాలిటీ యంత్ర పరికరాలు అందజేయాలన్నారు. అలాగే టెస్టింగ్ సెంటర్‌లో యంత్ర పరికరాలను పరిశీలించారు. అనంతరం ట్రాక్టర్ నగర్ ద్వారా రైతులకు అందుతున్న సేవ కార్యక్రమాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ట్రాక్టర్ నగర్‌ను రైతులు, అగ్రికల్చర్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రాక్టర్ నగర్ డైరెక్టర్ బాలాజీ మురారి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణ రెడ్డి, కమలాబాయి, నితీష్ శర్మ, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

15న తలనీలాల వేలం

పెద్దపప్పూరు: అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో తలనీలాలు పోగుచేసుకునే హక్కుల కోసం ఈనెల 15న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సుబ్రహ్మణ్యం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాఘమాసం మినహా విడిదినాల్లో మాత్రమే తలనీలాలు పోగుచేసుకోవచ్చన్నారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా రూ.50 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు.

దేశాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ నాయకులు

గుంతకల్లు రూరల్: యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా సన్మార్గంలో నడుస్తూ దేశాభివృద్ధికి పాటుపడాలని విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ రాష్ట్ర సంఘటన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ రాష్ట్ర సమావేశాలు సోమవారం ముగిశాయి.

సంఘటన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. యువత దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. ధర్మాన్ని కాపాడుతూ సమాజంలో సేవా కార్యక్రమాల పేరుతో సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమాజంలో స్త్రీలపై జరుగుతున్న మోసాలను కనిపెడుతూ వారిని కాపాడుకునే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భజరంగదళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, క్షేత్ర ప్రముఖ కార్యదర్శి కుమారస్వామి, రాష్ట్ర సేవా ప్రముఖ్ రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్ సబబే

పామిడి: కుట్రలు, కుతంత్రాలే మాజీ సీఎం చంద్రబాబు నాయుడును జైలుకు పంపాయని జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు డేరంగుల ఉదయ్ కిరణ్ అన్నారు. సోమవారం పామిడికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కాంలో అవినీతి జరిగినట్లు సీఐడీ నిగ్గు తేల్చడంతో చంద్రబాబును రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపారన్నారు. ఇన్నాళ్లు క్రిమినల్ ఆలోచనలతో కూడిన రాజకీయాలతో సకల వ్యవస్థలను చంద్రబాబు మేనేజ్ చేశారన్నారు. చట్టం దృష్టిలో తప్పులు చేసిన మొరార్జీ దేశాయ్, ఇందిరాగాంధీ, లాలూప్రసాద్ యాదవ్ వంటి ప్రముఖ రాజకీయ దిగ్గజాలు జైలుకు వెళ్లినట్లు గుర్తు చేశారు. చట్ట ప్రకారం అవినీతిపరుడైన బాబును అరెస్ట్ చేస్తే తెలుగుతమ్ముళ్లు ఓర్చుకోలేక పోతున్నారని తెలిపారు. టీడీపీ ఈ విషయాన్ని రాజకీయం చేసి ప్రజల సానుభూతి పొందేందుకు కుట్రలు పన్నుతోందన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆపన్నహస్తం



క్యాన్సర్ బాధితుడి సహాయార్థం విరాళం అందజేస్తున్న మురళి

తాడిపత్రి అర్బన్: బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందుతున్న తాడిపత్రికి చెందిన చిన్ని క్రిష్ణకు తాడిపత్రి వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సేవాదళ్ సంయుక్తంగా ఆపన్న హస్తం అందించారు. బాలుడు చిన్ని క్రిష్ణ కిమోథెరపీ కోసం రూ.44,500 ఆర్థిక సాయాన్ని అందించి, మానవత్వం చాటుకున్నారు. సోమవారం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో బాధితుడి పెద్దనాన్నకు ఈమొత్తాన్ని అందజేశారు. వాసవీ క్లబ్ సభ్యులు రూ.19,500, ఆర్యవైశ్య సేవాదళ్ సభ్యులు రూ.25,000 చొప్పున వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ భూమా సూర్యనారాయణ, కో–ఆర్డినేటర్ కందూరి సుబ్బరామయ్య, రీజియన్ చైర్మన్ కుప్పం సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పేద ఆర్యవైశ్య మహిళలకు దాతల సహకారంతో ఉచితంగా పెన్షన్లను అందజేశారు. ఆర్థికంగా తోడ్పాటు అందించిన దాతలకు వాసవీ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సేవాదళ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చంద్రశేఖర్, మురళీ,ప్రసాద్,శివ, హరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు



లబ్ధిదారులకు పథకాల కరపత్రం అందజేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

పెద్దపప్పూరు: రాష్ట్రంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని శింగనగుట్టపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటైన నాలుగున్నరేళ్లలో లబ్ధిదారులకు చేకూరిన లబ్ధిని వివరించారు. పథకాల కరపత్రాలను అందజేశారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి (రామయ్య) మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, వైస్ ఎంపీపీ పప్పూరు కళావతి, కో–ఆప్షన్ సభ్యుడు హాజీవలి, సీనియర్ నాయకులు వరదాయపల్లి శివారెడ్డి, మచ్చుకోట అమర్ నాథ రెడ్డి, చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరి, స్థానిక నాయకులు పప్పూరు డీలర్ సురేంద్ర, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమోనియాతో సొసైటీ సీఈఓ మృతి



అంత్యక్రియలకు ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

యాడికి: నిమోనియాతో బాధపడుతూ యాడికి ప్రాథమిక సహకార సంఘం సీఈఓ భాస్కర్ సోమవారం తెల్లవారుజామున బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ కొట్టి వెంకటరామిరెడ్డి, డైరెక్టర్లు, నారాయణ రెడ్డి, ఆదిరంగారెడ్డి, సహకార బ్యాంక్ మేనేజర్ దీపిక, తదితరులు రాయలచెరువుకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. భాస్కర్ మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మృతుడి అంత్యక్రియల కోసం సహకార సంఘం తరఫున రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అలరించిన ఘంటసాల నాటక ప్రదర్శన



నాటక ప్రదర్శనలోని ఓ సన్నివేశం

గుంతకల్లు: అంతరించిపోతున్న కళారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సీనియర్ డీపీఓ జయశంకర్ చౌహాన్, టీపీఆర్ ట్రస్ట్ అధినేత తలారి పరశురాముడు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక రైల్వే ఇనిస్టిట్యూట్‌లో పట్టణ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఘంటసాల నాటక ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. హైదరాబాద్‌కు చెందిన భాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో సురభి నాటక కళాకారులతో సినీ సంగీతసార్వభౌములు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు జీవిత విశేషాలను వివరించారు. నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వరరావు తదితర నటులతో సన్నివేశాలతో ఆకట్టుకున్నాయి. అమరగాయకుడు ఘంటసాల గొప్పతనాన్ని అంతరించిపోతున్న కళారంగాన్ని విలువను నేటి సమాజానికి తెలియజేయాలనే సంకల్పంతో నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు

అనంతపురం: కాలానుగుణంగా వస్తున్న మార్పులకనుగుణంగా నిరంతరం కొత్త అంశాలను అభ్యసించే నిత్య విద్యార్థుల్లా అధ్యాపకులు ఉండాలని జేఎన్‌టీయూ అనంతపురం రెక్టార్ ప్రొఫెసర్ ఎం. విజయకుమార్ పేర్కొన్నారు. సోమవారం క్యాంపస్‌లోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం వర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ శిక్షణ ప్రారంభమైంది. 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ పవర్ కన్వర్స్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్స్ ' అనే అంశంపై ఇస్తున్న శిక్షణపై వివరించారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎలక్ట్రికల్ వాహనాలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలు ధర తక్కువగా ఉంటుందన్నారు. ఈ క్రమంలో బ్యాటరీ మేనేజ్‌మెంట్‌పైన పరిశోధనలు కొనసాగాలని కోరారు. ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ బి. రవి కుమార్ మాట్లాడుతూ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ విభాగం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వర్ రెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జే శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి, డాక్టర్ ఎం. అంకారావు, తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లు అందజేయాలి

గుంతకల్లుటౌన్: అర్హత కలిగిన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సకాలంలో సదరం సర్టిఫికెట్లను అందజేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్‌ను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు కోరారు. సోమవారం ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి సురేష్, నాయకులు దేవేంద్ర, రామాంజి తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. సదరం సర్టిఫికెట్ల జారీలో జాప్యం జరుగుతుండటంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

అనంతపురం కల్చరల్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆరు రోజులుగా సాగుతున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ముగిశాయి. శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని నగరవీధుల్లో కృష్ణనామ స్మరణతో ఊరేగించారు. ఈ సందర్భంగా అరవిందనగర్‌లో ఏర్పాటు చేసిన పూలరథాన్ని సబ్ రిజిస్ట్రార్ ఆలీ ప్రారంభించారు. ఇందూ జ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను పరిచయం చేసి, జీవాత్మ, పరమాత్మ, ఆత్మ అనే మూడు ధర్మాల స్థాపనపై వివరించారు. కార్యక్రమంలో జ్ఞానవేదిక సభ్యులు సుధాకర్, పద్మావతి, అనరాధ, నాగమణి, జాహ్నవి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలను మోసం చేసేందుకు కుట్ర

తాడిపత్రి అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేసే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని షాదీఖానాలో వ్యవసాయ కార్మిక సంఘం 21 జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్లో నిధులు తగ్గించడం సరికాదన్నారు. పేదలను మోసం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్నారు. సమాచార హక్కు చట్టం, అటవీ హక్కుల సంరక్షణ చట్టాన్ని పూర్తిగా పక్కదారి పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. సామాజిక న్యాయం, ఉపాధి గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, నాయకులు మల్లికార్జున, దేవేంద్ర, తిరుపాలు, చిన్నరాయుడు, నాగరంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అష్టైశ్వర్యేశ్వర ప్రతిష్ట

అనంతపురం కల్చరల్: నగర శివారులోని నారాయణపురం పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన అష్టైశ్వర్యేశ్వరస్వామి లింగ ప్రతిష్ట సోమవారం శాస్త్రోక్తంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి విగ్రహంతో పాటు నందీశ్వరుడు, ధ్వజస్తంభం, కలశ ప్రతిష్ట జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా పాల్గొని, స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఎమ్మెల్యేను ఆలయ కమిటీ ధర్మకర్త ముత్యాలన్న, ఓబులపతి, ఇతర కమిటీ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు మల్లెల వేణుగోపాల్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బంద్.. తుస్



తాడిపత్రి అర్బన్: అంబేద్కర్ సర్కిల్‌లో తెరుచుకున్న వ్యాపార సముదాయాలు



తాడిపత్రి అర్బన్: రోడ్డుపై తిరుగుతున్న ఆర్టీసీ బస్సు

- యథావిధిగా తెరుచుకున్న దుకాణాలు
- అన్ని రూట్లలో తిరిగిన ఆర్టీసీ బస్సులు

తాడిపత్రి అర్బన్: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్ట్ కావడంతో టీడీపీ చేపట్టిన బంద్ విఫలమైంది. బంద్ ప్రభావం పట్టణంలో ఏమాత్రం కనిపించలేదు. జనంలో కనీస స్పందన కూడా కనిపించలేదు. సోమవారం ఉదయం యథావిధిగా పట్టణంలోని వ్యాపార సముదాయాలు, దుకాణాలు, కూరగాయల మార్కెట్లు తెరుచుకున్నాయి. ఎవరికి వారు వారి వారి పనుల్లో నిమగ్నమయ్యారు. ఇక ఆర్టీసీ బస్సులు యథావిధిగా రోడ్లపై తిరిగాయి. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఎప్పటిలాగే కొనసాగాయి. ప్రజా జీవనానికి ఏమాత్రం అంతరాయం ఏర్పడలేదు.

గుత్తి రూరల్/పామిడి: చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం టీడీపీ నాయకులు ప్రకటించిన బంద్‌ను ప్రజలు పట్టించుకోలేదు. ఉదయం నుంచి అన్ని వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు జరిగాయి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. పలుచోట్ల టీడీపీ నాయకులు దుకాణాలను బలవంతంగా మూయించేందుకు ప్రయత్నించగా దుకాణదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

'స్పందన'కు నాలుగు వినతులు

యల్లనూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని తహసీల్దారు సుమతి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భూమి వివరాలు ఆన్‌లైన్ నమోదుకు నాలుగు వినతులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పుష్పావతి

గుత్తి రూరల్: గుత్తి ఐసీడీఎస్ రూరల్ సూపర్‌వైజర్‌గా పుష్పావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంతకల్లు మునిసిపాలిటీలో విధులు నిర్వర్తిస్తున్న ఈమెను గుత్తికి బదిలీ చేశారు. నూతన సూపర్‌వైజర్‌గా బాధ్యతలు తీసుకున్న పుష్పావతిని సూపర్‌వైజర్లు నాగేశ్వరి, ప్రియాంక, 1098 చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ బాలాజీలు అభినందించారు. అనంతరం సూపర్‌వైజర్ పుష్పావతి పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని కాల్వగడ్డ వీధిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి. కాల్వగడ్డ వీధిలోని జెండా కట్ట వద్ద నుంచి నిర్వహించే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పాల్గొంటారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

పెద్దవడుగూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సురేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వివరాలు.. సోమవారం సాయంత్రం విధి నిర్వహణలో భాగంగా కానిస్టేబుల్ సురేష్ ద్విచక్ర వాహనంలో పామిడికి బయలుదేరారు. మిడతూరు వద్ద ఎదురుగా వచ్చిన ఓ ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పామిడికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.